# సాక్షి విశాఖపట్నం

బుధవారం ꠰ 13 ꠰ డిసెంబర్ ꠰ 2023






## 447 ఫోన్లు రికవరీ

చాట్‌బాట్ అప్లికేషన్ ద్వారా రూ.80 లక్షలు విలువ చేసే 447 సెల్ ఫోన్లు రికవరీ చేసినట్లు డీసీపీ–1 కె.శ్రీనివాసరావు తెలిపారు. 8లో



## ఆకర్షణీయంగా బీఆర్‌టీఎస్

బీఆర్‌టీఎస్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. 8లో



## ఏడు స్కూల్ ఆటోలపై కేసులు

రవాణా శాఖ అధికారులు స్కూల్ ఆటోలు, బస్సులపై తనిఖీలు నిర్వహించారు. ఏడు ఆటోలపై కేసులు నమోదు చేశారు. 8లో

## న్యూస్‌రీల్

### సింహగిరిపై 17 నుంచి ధనుర్మాసోత్సవాలు





సింహాద్రి అప్పన్న, గోదాదేవి

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 17 నుంచి ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మంగళవారం తెలిపారు. అలాగే సింహగిరిపై ఈ నెలతో పాటు వచ్చే జనవరిలో జరిగే పలు విశేష ఉత్సవాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ నెల 17న ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని, ఆ రోజు తెల్లవారుజామున సింహగిరిపై రాజగోపురంలో నెలగంట మోగించనున్నట్టు పేర్కొన్నారు. అప్పన్న స్వామికి, గోదాదేవికి విశేష పూజలు, తిరువీధి నిర్వహిస్తామన్నారు.

- ఆలయంలో ఈ నెల 13 నుంచి 22 వరకు పగల్‌పత్తు ఉత్సవాలు జరుగుతాయన్నారు. రోజూ ఉదయం స్వామివారికి తిరువీధి ఉత్సవం జరుపుతామని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్జిత సేవలను రద్దు చేశామన్నారు.
- ఈ నెల 23 నుంచి జనవరి 2వ తేదీ వరకు ఆలయంలో రాపత్తు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. రోజూ సాయంత్రం 5 గంటలకు స్వామికి తిరువీధి ఉంటుందని, ఈ ఉత్సవాలు సందర్భంగా రాత్రి 7 గంటల వరకే భక్తులకు దర్శనాలు లభించనున్నట్టు పేర్కొన్నారు.
- వచ్చేనెల 11 నుంచి 15వ తేదీ వరకు రోజూ ఉదయం సింహగిరిపై గంగధార వద్ద స్వామికి ధారోత్సావాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జనవరి 11 నుంచి 15వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్టు ఈవో తెలిపారు.

### సీఎంఆర్ విరాళం

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం రూ.4.80 లక్షల అందజేత



కలెక్టర్ మల్లికార్జునకు చెక్కు అందజేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

మహారాణిపేట : జిల్లాలోని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.4.80 లక్షల చెక్కును కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అందజేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ నిధులను అందజేసినట్టు ఆయన తెలిపారు. జిల్లాలోని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఈ నిధులు ఉపయోగించాలని, అవసరమైతే మరిన్ని నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎంఆర్ అధినేతను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని వ్యాపారవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### మాజీ సైనికోద్యోగులకు 17న జాబ్‌మేళా

ఏయూ క్యాంపస్: భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టర్ జనరల్ రీసెటిల్‌మెంట్(డీజీఆర్)తో మాజీ సైనికోద్యోగులకు ప్రత్యేక జాబ్‌మేళా ఈ నెల 17న విశాఖపట్నంలోని ఐఎన్‌ఎస్ శాతవాహన వద్దనున్న హెచ్‌పీడీఆర్ మైదానంలో జరగనుంది. ఆసక్తి ఉన్న మాజీ సైనికోద్యోగులు తమ వివరాలను అదే రోజు ఉదయం 9 గంటల నుంచి నమోదు చేస్తామని, గుర్తింపు కార్డు, బయోడేటా, ఐదు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని అధికారులు ఒక ప్రకటనలో కోరారు. పూర్తి వివరాలకు న్యూఢిల్లీలోని సంయుక్త సంచాలకులు కార్యాలయంలో 020–26102838, స్థానికంగా ఎంఎస్‌సీపీవో ఎస్.పి యాదవ్‌ని 9137715795, 0891–281214 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### ఎఫ్‌సీఐలో మిల్లెట్ వంటకాలపై శిక్షణ

ఆరిలోవ : పాత డెయిరీ ఫారం సమీప విశాఖ వ్యాలీ స్కూల్ పక్కన ఉన్న ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో మిల్లెట్ వంటకాలపై శిక్షణ ఈ నెల 19న ప్రారంభం కానున్నట్టు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కె.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది 2 వారాల కాలపరిమితి గల కోర్సు అని, రూ.5 వేలు ఫీజు చెల్లించాలన్నారు. మిల్లెట్ దోసెలు, రాగి జావ, రాగి ముద్ద, సలాడ్, బ్రెడ్ రోల్స్, స్మూతీస్ తదితర మిల్లెట్ వంటకాలు నేర్పుతామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 94408 98507 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. బ్యాచ్‌కు 20 మందికి మాత్రమే శిక్షణ ఇస్తామన్నారు.

# అనంత కాంతులు

**గిరి పరిసరాలు.. చిమ్మ చీకట్లో వెలుగు దివ్వెల కాంతికి నూతన శోభను సంతరించుకున్నాయి. దేవ దేవుడైన అనంత పద్మనాభ స్వామి నామస్మరణతో మార్మోగాయి. పోటెత్తిన భక్తులతో అనంత పద్మనాభుని గిరి భక్త జన సాగరంగా మారింది. వేల దీప కాంతులు వెదజల్లిన ఆధ్యాత్మిక సుగంధాలకు భక్తులు పులకాంకితులయ్యారు. ఇది పద్మనాభం గ్రామంలో మంగళ** వారం సాయంత్రం నిర్వహించిన అనంత పద్మనాభ స్వామి దీపోత్సవ వైభవం.



దీప కాంతులతో అనంతుని గిరి



భక్తులతో కిక్కిరిసిన పద్మనాభస్వామి గిరి

- దేదీప్య మానంగా అనంతుని దీపోత్సవం
- దీప కాంతిలో ప్రభవించిన పద్మనాభుడు

పద్మనాభం : రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం మంగళవారం కనుల పండువగా జరిగింది. తైల దీపాలు వెదజల్లిన సింధూర వర్ణపు కాంతులతో అనంత పద్మనాభుని గిరి దేదీప్య మానంగా వెలుగొందింది. అనంతుని దీపోత్సవ దీప్తి దశ దిశల వ్యాపించి భక్తులకు ఆధ్యాత్మిక పారవశ్యాన్ని కల్పించింది. గిరి శిఖరాన ఉన్న అనంత పద్మనాభుడు, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 4 గంటల నుంచే భక్తుల తాకిడి కనిపించింది. మధ్యాహ్నం 3 గంటలకే పద్మనాభం రోడ్లన్నీ భక్తజన సందోహంతో నిండిపోయాయి. ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడి మరి మెట్లను రిజర్వ్ చేసుకున్నారు. కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి భూదేవి సమేతడైన అనంత పద్మనాభుని ఉత్సవ విగ్రహాలను వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలు, నాదస్వర వాయిద్యాల నడుమ గరుడ వాహనంపై తోడ్కొని వచ్చి విశేష పూజలు నిర్వహించారు. గిరిని అధిరోహించే ముందు భక్తులు తొలి పావంచా వద్ద కొలువు దీరిన స్వామిని దర్శించుకున్నారు.

సాయంత్రం 5 గంటలకు గిరిపై జేగంట మోగగానే భక్తులు 1,288 మెట్లకు ఇరువైపులా తైల దీపాలను వెలగించారు. తైల దీపాలంకరణతో అనంత పద్మనాభుని గిరికి సింధూర తోరణాలు అద్దినట్టు సుందర దశ్యం ఆవిష్కృతమైంది. దీపోత్సవాన్ని కనులారా వీక్షించిన భక్తులు పరవశించిపోయారు. ఈ సందర్భంగా బారి మందుగుండు సామగ్రి కాల్చారు. కోలాటం, తప్పెటగుళ్లు, పులివేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సారి ఘాట్ రోడ్డు ద్వారా కాలినడకన వెళ్లే భక్తులకు గిరిపైన అనంత పద్మనాభస్వామిని దర్శించుకునే భాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రథమ పావచంచా వద్ద పూజలు నిర్వహించి దీపం వెలిగించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభస్వామి ఊరేగింపు



దీపం వెలిగించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి

## వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా వరుదు కల్యాణి



వరుదు కల్యాణి

దొండపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు రాష్ట్ర కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఇందులో రాష్ట్ర మహిళా విభాగం కమిటీలో విశాఖ జిల్లా నుంచి తొమ్మిది మందికి చోటు కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మంతెన మాధవీవర్మ, జోనల్ ఇన్‌చార్జ్‌లుగా బి.పద్మావతి, పీలా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా మళ్ల దేవీవిశాలాక్షి, పెనుమత్స శ్రీదేవివర్మ, కార్యదర్శి ముదుండి రాజేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా నీలాపు లక్ష్మి, కొనల విజయ వినీతలను నియమించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కోరబ్ అనూషదేవిని రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లాకు చెందిన రొంగల నారాయణమ్మను రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

### రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా కొండా రాజీవ్



కొండా రాజీవ్



ముత్తంశెట్టి వెంకట శివసాయి సందీష్

రాష్ట్ర యువజన విభాగ కమిటీలో విశాఖ నుంచి నలుగురికి ప్రాతినిధ్యం కల్పించారు. ఇందులో రాష్ట్ర యువజన విభాగ కమిటీ ఉపాధ్యక్షుడిగా కొండా రాజీవ్‌గాంధీ, జోన్–2 జోనల్ ఇన్‌చార్జిగా ముత్తంశెట్టి వెంకట శివసాయి సందీష్, కార్యదర్శిగా అంబటి నాగ వినాయక శైలేష్, సంయుక్త కార్యదర్శిగా కండిపల్లి సతీష్‌కుమార్ నియమితులయ్యారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి రాష్ట్ర యువజన విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చెట్టి వినయ్, కార్యదర్శిగా చిక్కుడు చిన్నారావులను నియమించారు.

## ఎంటర్‌టైన్‌మెంట్‌కు అడ్డా

- పోలీస్ బ్యారెక్స్ వద్ద 'అర్బన్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్'కు అడుగులు
- 3.48 ఎకరాల్లో పీపీపీ విధానంలో రూ.40 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి
- అమ్యూజ్‌మెంట్, గేమింగ్, ఫన్, స్కేటింగ్, రెస్టారెంట్, అక్వేరియం జోన్ల ఏర్పాటు
- ఆసక్తి వ్యక్తీకరణకు దరఖాస్తులు ఆహ్వానించిన వీఎంఆర్‌డీఏ



ప్లాన్ నమూనా



ఎంట్రన్స్ నమూనా

దొండపర్తి: విశాఖ పర్యాటక సిగలో మరో కొత్త ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది. పర్యాటక రాజధానిగా విరాజిల్లుతున్న విశాఖలో త్వరలో సరికొత్త వినోద కేంద్రం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విందు, వినోదం, ఆహ్లాదం, విహారం అన్ని రకాల అనుభూతులను పంచే విధంగా ప్రాజెక్టు సిద్ధం కానుంది. జగదాంబ జంక్షన్‌కు అతి సమీపంలో సూపర్ బజార్‌కు ఆనుకొని ఉన్న వైశాఖి జల ఉద్యానవనం స్థలం 3.48 ఎకరాల్లో 'అర్బన్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్' ఏర్పాటుకు వీఎంఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. రూ.40 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)తో ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణకు బిడ్లు సైతం ఆహ్వానించింది.

**అన్ని హంగులతో..**

రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా అన్ని రకాల హంగులతో ఈ అర్బన్ ఎంటర్‌టైన్మెంట్ జోన్ ప్రాజెక్టుకు వీఎంఆర్‌డీఏ రూపకల్పన చేసింది. అమ్యూజ్‌మెంట్ అండ్ ఫన్ జోన్‌లో అనేక రకాల ఆహ్లాద, వినోద ఆటలతో పాటు బౌలింగ్ అలే కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే గేమింగ్ జోన్‌లో పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరికి ఉత్సాహవంతమైన వీడియో, ఆర్కేడ్, ఇతర ఎలక్ట్రానిక్ గేమ్స్‌తో పాటు ఇండోర్ స్కేటింగ్ రింక్ అందరినీ అలరించనున్నాయి. అదే విధంగా పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా థీమేటిక్ యానిమేషన్ ప్రదర్శన తీర్చిదిద్దనున్నారు. సముద్ర గర్భంలో విహరిస్తున్న అనుభూతిని అందించేలా అక్వేరియం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అలాగే హస్తకళాకారులు తయారు చేసిన వస్తువుల విక్రయాలు, డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, విశాలమైన పార్కింగ్ సౌకర్యాలతో ఈ ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**టెండర్లు ఆహ్వానం**

ఈ అర్బన్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్ నిర్మాణాన్ని పీపీపీ పద్ధతిన చేపట్టేందుకు వీఎంఆర్‌డీఏ అధికారులు ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణకు బిడ్లు ఆహ్వానించారు. రూ.40 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దాలని నిర్ణయించారు. గత నెల 28వ తేదీ నుంచి ఆసక్తి ఉన్న సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా.. ఈ నెల 14న వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రీ బిడ్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇందులో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి ఉన్న వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా పాల్గొనే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా బిడ్లు వేసే అవకాశం కల్పించారు. ఈ నెల 30న బిడ్లు తెరిచి అర్హత సంస్థకు ప్రాజెక్టు బాధ్యతలు అప్పగించనున్నారు.

## సిరుల తల్లి.. కల్పవల్లి

- విశాఖవాసుల ఆరాధ్యదైవం 'కనకమహాలక్ష్మి'
- మార్గశిర మాసోత్సవాలకు సర్వం సిద్ధం
- గురువారం పూజలకు అధికార యంత్రాంగం సన్నద్ధం





కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్) అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువుదీరిన మహా మహిమాన్వితురాలు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు. ఉత్తరాంధ్ర జిల్లాల వాసులకు సత్యంగల తల్లిగా.. కల్పవల్లిగా, కోరిన వరాలిచ్చే అమృతమూర్తిగా, ఆంధ్ర జనావళికి తల్లిగా భాసిల్లుతోంది. ఈ నెల 13 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు శ్రీ కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ మాసోత్సవాల్లో భాగంగా గురువారాల్లో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ నెల 14, 21, 28, జనవరి 4, 11 తేదీల్లో వచ్చే గురువారాల్లో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేస్తారు. ఈ నెల 31న వేదసభ, అర్చక సదస్సు, జనవరి 2న నాదస్వరం కచేరి, 6న రథయాత్ర, 11న సహస్ర ఘటాభిషేకం జరగనుంది. ఆ రోజునే మహాన్నదానం కూడా నిర్వహించనున్నారు.

> 31న వేదసభ, అర్చక సదస్సు
> జనవరి 2న నాదస్వరం కచేరి
> 6న రథయాత్ర
> 11న సహస్ర ఘటాభిషేకం

**అమ్మవారి మాలధారణ**

కనకమహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహం, కోరిన కోర్కెలు నెరవేరడానికి మార్గశిర మాసంలో మాలధారణ దీక్ష పాటిస్తారు. గత దశాబ్ద కాలం నుంచి అమ్మవారి దీక్ష పాటిస్తున్న భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీక్ష చేపట్టిన భక్తులు ఆకుపచ్చ వస్త్రాలు ధరించి, ఆకుపచ్చని మాలలు ధరించాలి. సర్వశక్తి స్వరూపిణి అయిన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి పేరిట మార్గశిర దీక్ష చేసే భక్తుల కోసం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది.

**దీక్ష విరమణ :** మార్గశిర మాసం నాలుగో గురువారం తర్వాత వచ్చే శనివారం తెల్లవారుజామున దీక్ష విరమణ ఉంటుంది. దీక్ష విరమణానంతరం ఇరుముడి, పూజాద్రవ్యాలు, హోమ ద్రవ్యాలతో ఊరేగింపుగా కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శనం చేసుకుని, అనంతరం హోమ ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించి దీక్షను విరమించాలి.

### మార్గశిర మాసంలో రోజు వారీ పూజలు(గురువారం మినహా)..

- ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్ర నామార్చన
- ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సర్వదర్శనం
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన
- మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వ దర్శనం
- సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం
- రాత్రి 7 నుంచి వేకువజాము 4.30 గంటల వరకు సర్వదర్శనం

### మండపంలో జరిగే వైదిక కార్యక్రమాలు(గురువారం మినహా..)

- ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పంచామృతాభిషేకం, శ్రీచక్రనవావర్ణార్చన
- ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చన
- ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మార్గశిర మాస శ్రీలక్ష్మీ పూజ, వేదపారాయణ, మహావిద్యా పారాయణ, సప్తశతీ పారాయణ
- ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అష్టోత్తర కుంకుమార్చన

### గురువారాల్లో జరిగే విశిష్ట పూజలు

- బుధవారం రాత్రి(తెల్లవారితే గురువారం) 12.05 నుంచి 1.30 గంటల వరకు అమ్మవారికి విశేష పంచామృతాభిషేక సేవ, సహస్ర నామార్చన పూజ, స్వర్ణాభరణ అలంకరణ
- 1.30 నుంచి సాయంత్రం 11.30 గంటల వరకు సర్వ దర్శనం
- 11.30 నుంచి 12 గంటల వరకు మహానివేదన(రాజభోగం)
- మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్వదర్శనం
- సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు అమ్మవారికి విశేష పంచామృతాభిషేక సేవ, సహస్ర నామార్చన, స్వర్ణాభరణ అలంకరణ
- రాత్రి 7 గంటల నుంచి సర్వదర్శనం, సాంస్కృతిక కార్యక్రమాలు

## మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో బుధవారం నుంచి జరగనున్న మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జేసీ, సమన్వయ కమిటీ చైర్మన్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. సమన్వయ కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం దేవస్థానం సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. వీఐపీలు, సాధారణ భక్తులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్య శిబిరాలు, విద్యుత్, తదితర అంశాలపై సంబంధిత శాఖాధికారులతో జేసీ సమీక్షించి పలు సూచనలు చేశారు. తాత్కాలిక పోలీసు ఠాణా, పోలీసు బందోబస్తును అందుబాటులో ఉంచనున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు. ఆలయ పరిసరాలతో పాటు వీధుల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, తరలించేందుకు అవసరమైన డస్ట్ బిన్లను ఏర్పాటు చేశామని జీవీఎంసీ అధికారులు తెలిపారు. తాత్కాలిక మరుగుదొడ్లను అవసరమైన ప్రదేశాలలో ఏర్పాటు చేశామన్నారు. అగ్నిమాపక శకటంతో పాటు ముఖ్య ప్రదేశాల్లో మంటలు ఆర్పే యంత్రాలను సిద్ధం చేశామని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు వివరించారు. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిని జేసీ ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించామని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో మత్తు పానియాల విక్రయాలు, వినియోగం లేకుండా సంచార బృందాలను ఏర్పాటు చేసి, నిఘా పెట్టాలని అబ్కారి శాఖాధికారులకు జేసీ సూచించారు. ఈ సమావేశంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్.వెంకటరమణ, జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాస్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యులు, పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ, దేవదాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఏర్పాట్లు పరిశీలన**

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలను బుధవారం ఉదయం 8.01 గంటలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఉత్సవాల ఏర్పాట్లను జేసీ విశ్వనాథన్ ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలంతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. ముందుగా అమ్మవారిని జేసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### నిత్యాన్నదానం

కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసంలో ప్రతి రోజూ 2 వేల మందితో పాటు దాతల సహకారంతో మరికొంత మందికి అన్నదానం చేస్తారు. మార్గశిర మాసం చివరి గురువారం నాడు వేలాది మంది భక్తులకు మహాన్నదానం చేపట్టనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు.

# రేపటి నుంచి ఆర్గానిక్ మేళా

బీచ్ రోడ్డు: ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ వేదికగా ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగే గో ఆధారిత ప్రకృతి పంటల మేళాను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ కోరారు. మంగళవారం ఆర్కే బీచ్‌లో గో ఆధారిత ప్రకృతి పంటల రైతుల సంఘం నిర్వహించిన ఆర్గానిక్ మేళా ఆరోగ్య నడకను ఆయన ప్రారంభించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ మన ఆరోగ్యం మనం తినే ఆహారంపై ఆధారపడి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం, ఆహారంగా తీసుకోవడం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమార్‌స్వామి, గో ఆధారిత ప్రకృతి రైతు సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యవర్మ, అశోక్‌కుమార్, డాక్టర్ కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


ఆర్గానిక్ మేళా ఆరోగ్య నడకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్, తదితరులు

# చాట్ బాట్ ద్వారా 447 ఫోన్లు రికవరీ

- వీటి విలువ సుమారు రూ.80 లక్షలు
- త్వరలోనే బాధితులకు అందజేస్తాం
- డీసీపీ–1 కె.శ్రీనివాసరావు


రికవరీ చేసిన మొబైల్స్‌ను పరిశీలిస్తున్న డీసీపీ-1 కె.శ్రీనివాసరావు

దొండపర్తి: చాట్‌బాట్ అప్లికేషన్ ద్వారా రూ.80 లక్షలు విలువ చేసే 447 సెల్ ఫోన్లు రికవరీ చేసినట్లు డీసీపీ–1 కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈ మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా ఫోన్ పోయిన వెంటనే ఫిర్యాదు చేస్తే చాట్‌బాట్ ద్వారా రికవరీ చేసే అవకాశం ఉందని తెలిపారు. అపహరించిన వారు మొబైల్‌ను ఆన్ చేసిన వెంటనే యాప్‌లో సమాచారం అందుతుందని, తద్వారా మొబైల్‌ను గుర్తించవచ్చన్నారు. ఇలా వచ్చిన ఫిర్యాదుతో ఇప్పటివరకు ఢిల్లీ, రాజస్తాన్, కేరళ, తమిళనాడు, ఒడిశా, తెలంగాణతో పాటు తిరుపతి, గుంటూరు, పశ్చిమ, తూర్పు గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఈ మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీటిని బాధితులకు త్వరలోనే అందజేస్తామన్నారు.

# ఘనంగా సాగర హారతి


సాగర హారతి కార్యక్రమంలో పాల్గొన్న స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ

బీచ్‌రోడ్డు : కోటి వత్తుల దీపకాంతులతో కార్తీక సాగర హారతిని విశ్వ భారత్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్కే బీచ్‌లో ఘనంగా నిర్వహించా రు. వేద పండితులు ముందుగా శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి పలు రకాల జలాలతో అభిషేకం చేశారు. అనంతరం భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు కోటి వత్తులను ప్రమిదల్లో పెట్టి పూజలు చేసి దీపాలు వెలిగించారు. దీంతో సాగరతీరం దీపకాంతులతో వికశించింది. అనంతరం సముద్రుడికి సాగర హారతి ఇచ్చా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిజీ హాజరై ప్రసంగించారు.



# భార్య మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు

విశాఖ లీగల్: అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భార్య మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని మహిళా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి లాలం శ్రీధర్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు సాగినాల రవి(23) ఒంగోలు జిల్లా రౌతుపల్లి గ్రామవాసి. ఉపాధి కోసం 2005లో విశాఖ వచ్చాడు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జెండా చెట్టు దగ్గర అచ్చయ్యమ్మపేటలో ఉండేవాడు. అచ్చయ్యమ్మపేటకు చెందిన చిట్టి అలియాస్ మార్తమ్మను 2005 మేలో వివాహం చేసుకున్నాడు. ఆ సమయంలో మార్తమ్మ కుటుంబ సభ్యులు రూ.30 వేలు నగదు, బంగారం కట్నంగా ఇచ్చారు. కొంతకాలం వారి కాపురం సజావుగా సాగింది. తరువాత రవి తరచూ భార్యను అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఉపాధి కోసం హైదరాబాద్, ఒంగోలు వెళ్లి ఏడాది తర్వాత మళ్లీ విశాఖ వచ్చారు. రవి నిత్యం మద్యం సేవిస్తూ భార్యను హింసించేవాడు. మార్తమ్మ తల్లిదండ్రులు తమ స్తోమత మేర రూ.5 వేలు ఇచ్చారు. అయినా రవి తీరులేదు. 2008 మార్చి 29న భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. భర్తతో వేగలేని మార్తమ్మ అదే రోజు ఉదయం ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని, అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు నిందితుడిపై 304బీ కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.



# ఎల్‌బీ శ్రీరామ్‌కు 'గొల్లపూడి' పురస్కారం ప్రదానం

సీతంపేట: తెలుగు సాహిత్యంలో గొల్లపూడి మారుతీరావు మరో ఆణిముత్యమని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. నవసాహితీ ఇంటర్నేషనల్( చెన్నై) ప్రవేశపెట్టిన గొల్లపూడి స్మారక పురస్కారాన్ని ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ఎల్‌బీ శ్రీరామ్‌కు ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దాడి మాట్లాడుతూ కథకుడిగా, నాటక కర్తగా, నటుడిగా, 25 ఏళ్ల పాటు ఓ పత్రికలో జీవనకాలమ్ నడిపిన పాత్రికేయుడిగా గొల్లపూడి ప్రదర్శించిన ప్రతిభా పాటవాలు అభినందనీయమని కొనియాడారు. పురస్కార గ్రహీత ఎల్‌బీ శ్రీరామ్ మాట్లాడుతూ గొల్లపూడితో తనకున్న అనుబంధాన్ని, రంగస్థలం, సినిమా నటుడిగా ఉన్న సంబంధాన్ని చమత్కారంగా హాస్యోక్తులతో వివరించారు. సురభి పత్రికలో మారుతీరావుపై తాను రాసిన వ్యాసాన్ని ఆయన చదివి వినిపించారు. ముందుగా గొల్లపూడి, ఎల్‌బీ శ్రీరామ్ నటించిన పల్లకి లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఆచార్య వెలమల సిమ్మన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు మిశ్రో, నవసాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు, మేడా మస్తాన్‌రెడ్డి, ఏపీ మా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ, స్మార్ట్ ఇన్ అధినేత బాబ్జి, డి.వి. సూర్యారావు, గొల్లపూడి రామకృష్ణ, నవ సాహితీ కార్యదర్శి డాక్టర్ గోపీచంద్, సభ్యులు యడవల్లి సుధాకర్ పాల్గొన్నారు.


నటుడు ఎల్‌బీ శ్రీరామ్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న దాడి వీరభద్రరావు, తదితరులు

# ఆకర్షణీయంగా బీఆర్‌టీఎస్ రోడ్డు

అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం

దాబాగార్డెన్స్: బీఆర్‌టీఎస్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. జ్ఞానాపురం నుంచి పెందుర్తి వరకు చేపడుతున్న బీఆర్‌టీఎస్ రోడ్డు మరమ్మతు పనులను మంగళవారం జీవీఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. జ్ఞానాపురం, ఎన్ఏడీ, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో తాగునీటి పైపుల కోసం తీసిన గోతులను త్వరితగతిన పూడ్చాలని పర్యవేక్షక ఇంజినీర్లు వేణుగోపాల్, రామ్మోహనరావుకు కమిషనర్ సూచించారు. ఎన్ఏడీ, పెందుర్తి మధ్య ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టి పెయింటింగ్ వేయాలన్నారు. సర్వీసు రోడ్లు, ప్రధాన రహదారుల పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. చినముషిడివాడలో డివైడర్ మధ్యలో వేసిన మొక్కలను పశువులు తినకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదరరావును ఆదేశించారు.


జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రోడ్డును పరిశీలిస్తూ అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్

# ఏడు స్కూల్ ఆటోలపై కేసులు

గోపాలపట్నం: రవాణా శాఖ అధికారులు మంగళవారం స్కూల్ ఆటోలు, బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మర్రిపాలెం, ఎన్ఏడీ కూడలి ప్రాంతాల్లో చేపట్టిన ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న ఏడు ఆటోలపై కేసులు నమోదు చేశారు. ఒక ఆటోను సీజ్ చేశామని రాజారత్నం పేర్కొన్నారు. రెండు రోజులుగా చేపట్టిన తనిఖీల్లో 25 ఆటోలపై కేసులు నమోదు చేశామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అధికారులు సుధీర్, ఎంవీఎస్ ప్రకాష్‌రావు, రాజారావు, శిరీష దేవి పాల్గొన్నారు.




# యాదవుల సంక్షేమానికి పెద్దపీట

వన సమారాధనలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ మేయర్ హరి వెంకటకుమారి

బొండపల్లి: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని యాదవుల సంక్షేమానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గొట్లాం సమీపంలో జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గొర్రెలు, మేకలు పెంపకందారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు అనేక రాయితీలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, విజయనగరం జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఫుడ్ కమిషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బి.కాంతారావు, యాదవుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్యాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు


ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిలో జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు మంగళవారం ముగిశాయి. శాస్త్రీయ సంగీత గాత్రం, జానపద సంగీత గాత్రం, ఏకపాత్రాభినయాలు, సంప్రదాయ బొమ్మల తయారీ, తదితర విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. నడుపూరు, ఆరిపాక, కాశీపురం జెడ్పీహెచ్ పాఠశాలల విద్యార్థులు, భీమిలి పీఎస్ఎం ఉన్నత పాఠశాల, నక్కపల్లి అంబేడ్కర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాల్లో నిలిచారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గొట్టేరి రవి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు విజయవాడలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

# రిటైర్డ్ ఉద్యోగుల గోల్డ్ కాయిన్ నిలుపుదల

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పదవీ విరమణ గోల్డ్ కాయిన్, లాంగ్ సర్వీసు సిల్వర్ కాయిన్‌ను నిలుపుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు పదవీ విరమణ చేసేటప్పుడు ఫైనల్ సెటిల్‌మెంట్‌తో పాటు 10 గ్రాముల గోల్డ్ కాయిన్‌ను కానుకగా అందజేయడం ఆనవాయితీ. 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు 150 గ్రాముల వెండి కాయిన్ ఇస్తున్నారు. ఈ రెండింటిని ఈ ఏడాది నవంబర్ 23 నుంచి నిలుపుదల చేస్తున్నట్టు ఉక్కు యాజమాన్యం మంగళవారం ఉత్వర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని తెలిపింది.